ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 23 | సంచిక : 8 | ఏప్రియల్ 2018

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥ 150/-
విడి ప్రతి : రూ॥ 12/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

04-08-1985
జిన్నూరు
జూన్ 2017
జిన్నూరు

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 04-08-1985, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనస్సులో ఎదుగుదల లేనివాళ్ళు, మనస్సు నిర్మలంగా లేనివాళ్ళు, విశాలమైన హృదయం లేనివాళ్ళు ఆధ్యాత్మిక జీవితానికి పనికిరారు. అంటే చపలచిత్తంగా ఉంటారని. అసలు శ్రవణం చెయ్యటానికి కూడా వారికి అర్హత లేదు. మన మనస్సు ఏమీ ఎదగటంలేదు అనుకోండి, ఆధ్యాత్మిక విషయాలు ఎలా తెలుసుకోగలము? మనస్సుతోటి కదా మనం గ్రహించవలసినది. అందుచేత మన మనస్సుని ఎదగనివ్వాలి. ఎవరితో సహవాసం చేస్తే మన మనస్సు ఎదుగుతోందో, ఎవరి సహవాసం వల్ల మన మనస్సు వికసిస్తోందో వాళ్ళని, వాళ్ళతోటి ఉన్న సహవాసాన్ని, మనకి నిజమైన ఆస్తిగా మనం తీసుకోవాలి. విభీషణుడికి రావణాసురుడు స్వయంగా అన్నగారు అయినప్పటికీ భగవంతుడి కోసం, తను వికసించటం కోసం, తన ముక్తికోసం, తన అన్నగారైన రావణాసురుడిని విడిచిపెట్టాడు కాబట్టి మహాభక్తుడు అయ్యాడు. మన అన్నగారు కదా అని ఏదోరకంగా అతనికే సపోర్ట్ ఇద్దాము అనుకుంటే విభీషణుడికి ఏనాడో పతనం ప్రారంభం అయ్యి ఉండేది. భగవంతుడి కోసం తన అన్నని కూడా విడిచిపెట్టాడు. అందుచేత మనస్సు యొక్క వికాసం ముఖ్యం. మనస్సు యొక్క వికాసం లేకుండా మనిషి ఆధ్యాత్మిక చింతనకి అసలు పనికిరాడు. మనస్సు ఎదగాలి. కొంతమంది మనుషులతో సహవాసం చేస్తే మన మనస్సుని ఎదగనివ్వరు వాళ్ళు. అది మనకు తెలుస్తూ ఉంటుంది. అప్పుడు వెంటనే ఆ స్నేహాన్ని కట్ చేసుకోవాలి. అందుకే మనం వర్తమానంలో జీవించటం నేర్చుకోవాలి.

వ్యవహారం దగ్గర మొహమాటం పనికిరాదు అంటారు. స్నేహాల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మన ఇంటిలో బంగారం ఉంది అనుకోండి, వెండి, ఇత్తడి, రాగి కూడా ఉందను కోండి, ఇత్తడిని, రాగిని ఇంట్లో దాచుకొని బంగారాన్ని, వెండిని వీధిలో పడేస్తుంటే ఎలా అనిపిస్తుంది మనకి? వాడు ఎంత అమాయకుడు, వెర్రివాడిలా ఉన్నాడు అనుకొంటాము. యదార్థం ఆలోచిస్తే మన పరిస్థితి కూడా అదే. ఆధ్యాత్మికంగా ఆలోచిస్తే మన పరిస్థితి అదే. అంటే మనం ఆత్మని వదిలేస్తున్నాము, భోగాలని దాచుకొంటున్నాము. బంగారం వెండి పారేసుకొనే వాడిని చూసి వెర్రివాడు అనుకుంటాము, కానీ వాడు చేస్తున్న పనే మనమూ చేస్తున్నాము. ఆత్మని వదిలేస్తున్నాము మన స్వరూపాన్ని వదిలేస్తున్నాము, భోగాలని దాచుకొంటున్నాము. ఏదైతే మనకి సుఖాన్ని కలుగజేస్తుందో, దాన్ని వదిలేస్తున్నాము. ఏదైతే దుఃఖాన్ని తీసుకొస్తుందో వాటిని దాచుకొంటున్నాము. మనకి తెలియకుండా మనం చేసే పనులు ఇవి. ఇలా చేస్తున్నాము అన్న సంగతి కూడా మనకి తెలియదు. తెలియకుండానే మన ద్వారా జరుగుతున్న పనులు ఇవి.

భగవాన్ అంటే ఆ శరీరం కాదు, భగవాన్ అంటే ఆత్మ. ఆత్మ ఇప్పుడు లేకుండా పోయిందా? ఒకవేళ నిజంగా ఇప్పుడు ఆత్మ లేకుండా పోతే, అటువంటి ఆత్మని మనం తెలుసుకోవటం ఎందుకు? భగవాన్ ఇప్పుడు లేరు అనుకోవటం కూడా అపచారం. మనకి భగవాన్ అంటే శరీరదృష్టి ఉంది కాబట్టి. ఆ శరీరం ఇప్పుడు లేదు కాబట్టి, భగవాన్ లేరు అనుకొంటున్నాము. భగవాన్‌కి శరీరం ఉన్నప్పుడు కూడా ఆయన ఆ శరీరం కాదు, భగవాన్ అంటే ఆత్మ. ఆత్మ ఎప్పుడూ ఉంటుంది. ఆత్మ శాంతిస్వరూపం అనుగ్రహస్వరూపం. ఆత్మకి మరొక పేరు అనుగ్రహం. ఒకోసారి ఆత్మే ఈ శరీరాలు ధరిస్తూ ఉంటుంది. ఆత్మ యొక్క ఉనికి లేకుండా అసలు శరీరం రాదు. ఏ శరీరం వచ్చినా అక్కడ ఆత్మ యొక్క అస్థిత్వం ఉన్నట్లే. అయితే మనకి ఎందుకు మోహం కలుగుతోంది అంటే మనకి ఆత్మదృష్టి లేదు, రూపదృష్టి ఉంది. మనకి ఎంతసేపూ రూపదృష్టి ఉంది కాబట్టి మోహం కలుగుతుంది. ఆత్మదృష్టి కనుక వస్తే మనకి ఇంక మోహం కలుగనే కలుగదు. మనిషిని బంధించేది, మనిషిని మోహంలో పెట్టేది ఆత్మ కాదు, రూపమే. రూపం మనిషిని బంధిస్తుంది, మోహపెడుతుంది. మనందరికీ రూపదృష్టి ఉంది కాబట్టి మోహంలో పడుతున్నాము. రూపం లేకుండా ఆత్మ ఉండగలదు కానీ ఆత్మ లేకుండా రూపం ఉండలేదు.

తలంపుల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. ఒక చిన్న చెడుతలంపు

వస్తుందనుకోండి మనకి, చిన్నదే కదా అనుకుంటాము. మళ్ళీ రేపు వస్తుంది అనుకోండి ఇది చిన్నదే కదా అనుకుంటాము, ఈ చిన్నవి చిన్నవి అన్నీ కలిపి పెద్దవి అవుతాయి. అక్కడి నుంచీ మన స్వభావాన్ని మార్చేస్తాయి. అంటే ఆత్మని తెలుసుకోవటానికి అర్హత లేకుండా పాడైపోతాము. అందుచేత తలంపుల విషయంలో మనము జాగ్రత్త పడాలి. భగవంతుడు వాసుదేవస్వామి వర్తమానాన్ని విడిచిపెట్టవద్దని చెప్పారు. నీ మనస్సు విషయం పరిశీలించుకో. నిన్ను లోపల నీ సోర్సుకి తీసుకువెళ్ళేది నీ మనస్సే, నిన్ను బహిర్ముఖం చేసేది నిన్ను పతనం చేసేది కూడా నీ మనస్సే. అందుచేత నువ్వు ఉద్ధరింపబడాలంటే నీ మనస్సు విషయంలో నువ్వు బహుజాగ్రత్తగా ఉండు, అది ఎలా పనిచేస్తోందో చూసుకో. నీ మనస్సుని నువ్వు జాగ్రత్తగా చూసుకోవాలంటే వర్తమానకాలంలో ఎప్పుడూ అటెన్షనులో ఉండు. జరిగిపోయిన గొడవలు అస్తమానూ తలపెట్టుకోకు. జరుగబోయే గొడవలు గురించి అస్తమానూ ఆలోచించకు. వర్తమానకాలంలో జీవించు. మనకి ఎంతో కొంత దుఃఖం వస్తోంది కదా! ఇంటిలో ఉన్న పరిస్థితుల వల్ల సమాజంలో ఉన్న పరిస్థితుల వల్ల నూటికి పది వంతులు మనకి దుఃఖం వస్తే మిగతా తొంభై వంతులు కూడా మన మనస్సే కల్పిస్తోంది. మీరు అబ్జర్వ్ చేసి చూసుకోండి. మన ఇంటిలో ఉన్న పరిణామాలను బట్టి సమాజంలో ఉన్న పరిణామాలను బట్టి మనకి దుఃఖం వస్తోంది అనుకోండి, ఆ దుఃఖం నూటికి పది వంతులే వచ్చేది. మిగతా తొంభై వంతులు కూడా నా మనస్సు నాకు కల్పిస్తోంది ఇంటి దగ్గర ఏకాంతంగా కూర్చున్నప్పుడు చూసుకుంటే మీకే తెలుస్తుంది మీ మనస్సు మీకు ఎంత ఎక్కువ దుఃఖాన్ని తీసుకొస్తోందో.

ఎవరైనా మనల్ని హింసపెడితే, ఎవరైనా మనని కష్టమైన మాటలు అంటే మనకి ఎంతో ఆందోళన కలుగుతుంది. హింసలకి గురి అవ్వకుండా, కష్టమైన మాటలు భరించకుండా ఈ ప్రపంచంలో ఎవడూ మహాత్ముడు అవ్వలేదు. విద్య నేర్చుకోవాలనే తపన మీకు ఉండాలి కానీ ఏదో ఒక రూపంలో అది వస్తుంది. నేనే చెప్పాలి అని అక్కరలేదు. అసలు మీ హృదయంలో మీకు తపన అంటూ ప్రారంభమైతే ఈశ్వరుడు గురువుని మీ దగ్గరికే పంపిస్తాడు. ఆ తపన మటుకు మీ హృదయంలోంచి రావాలి. నటించటం కాదు, ప్రిటెన్షన్‌కాదు, హృదయంలోంచి తపన రావాలి. సూరదాస్ గుడ్డివాడు, కృష్ణభక్తుడు. ఆయనకి విద్య నేర్చుకోవాలని ఉండేది, వాళ్ళ నాన్న తన అన్నదమ్ములకి, చుట్టుప్రక్కలవారికి అందరికీ విద్య చెప్పేవాడు. ఒకసారి “నాన్నా నువ్వు అందరికీ చదువు చెపుతున్నావు, నాకు

కూడా చదువు చెప్పు" అన్నాడు సూరదాస్. "నువ్వు గుడ్డివాడివి, గుడ్డివాడికి చదువు ఏంటి? వెళ్ళి మీ అమ్మ దగ్గర కూర్చో" అన్నాడు వాళ్ళ నాన్న. అంటే గుడ్డివాడని లోకువ. పాపం భౌతికంగా గుడ్డివాడే, ఆ హృదయంలో తపన ఉంది, అది తండ్రి గ్రహించలేదు. వీడు ఎందుకూ పనికిరాడు అని తల్లి కూడా లోకువగా చూసేది. "నేను బయటకు వెళ్తే అందరూ గుడ్డివాడు అంటున్నారు అమ్మా" అనేవాడు సూరదాస్. "నిజమే, అందుకే నిన్ను వీధిలోకి వెళ్ళవద్దు అంటున్నాను, నువ్వు గుడ్డివాడవు కాబట్టి గుడ్డివాడు అంటున్నారు" అని చెప్పేది. వీధిలోకి వెళ్ళకుండా, ఇంట్లో ఎంతసేపు అని కూర్చుంటాడు? తండ్రి చూస్తే విద్య నేర్పటం లేదు, తల్లీ నేర్పటంలేదు అని అన్నదమ్ములని విద్య నేర్పమని అడిగాడట. అప్పుడు వాళ్ళు "నువ్వు అమ్మ దగ్గర చేతనైతే వంట నేర్చుకో, నీకు చదువు ఏంటి? నీకు కళ్ళు లేవు" అన్నారు. ఇవన్నీ కృష్ణుడు చూడటంలేదా? అతని తపన ఏమిటంటే చదువు నేర్చుకోవాలి అని. ఎవరూ చదువు చెప్పటంలేదు కానీ అతనికి నేర్చుకోవాలని ఉంది. ఒకరోజు ఇంట్లో కూర్చుని ఉండగా రోడ్డు మీద ఎవరో ముష్టివాళ్ళు పాటలు పాడుకుంటూ వెళ్తున్నారు. కృష్ణుడి మీద పాటలు పాడుకుంటూ ముష్టి ఎత్తుకోవటానికి వచ్చారు. పోనీ ఆ పాటలు అయినా నేర్చుకొందాము అని ఆ పాటలు పాడే వాళ్ళ కూడా వెళ్ళిపోయాడు సూరదాస్. నాకు విద్య కావాలి ఇప్పుడు నాకు అన్నం ముఖ్యం కాదు, విద్య కావాలి. కానీ తల్లి, తండ్రి, అన్నదమ్ములు ఎవ్వరూ చెప్పటంలేదు. వీధిలోకి వెళ్తే గుడ్డివాడినని హేళన చేస్తున్నారు కానీ చదువు చెప్పటానికి ఊళ్ళో వాళ్ళు కూడా ఎవరూ ముందుకు రావటం లేదు, పోనీ ఆ ముష్టి వాళ్ళ పాటలు అయినా నేర్చుకుందాము అని వాళ్ళ కూడా వెళ్ళిపోయాడు. ఆయన విద్యాతృష్ణ అటువంటిది. విద్యపట్ల ఆయనకి ఉన్న తపన ఆయన ఇల్లు కూడా విడిచిపెట్టేటట్లు చేసింది. ఆ ముష్టివాళ్ళు ఏదో ఒకటో రెండో పాటలు నేర్పారు. ఈ గుడ్డివాడు ఎప్పటికైనా మనకి బరువు అవుతాడు అని వాళ్ళకి అనిపించింది. ఒకరాత్రి నిద్రలో ఉండగా, ఆ ముష్టివాళ్ళు ఆయనని అక్కడే విడిచిపెట్టేసి వెళ్ళిపోయారు. అప్పుడు కూడా సూరదాస్‌లో విద్యాతృష్ణ పోలేదు. ఏ గ్రామంలో అయితే ఆ ముష్టివాళ్ళు విడిచిపెట్టారో ఆ గ్రామంలోనే ఉండి తపస్సు ద్వారా కొంత విద్యని సాధించాడు. కేవలం పుస్తకాలు చదవటం ద్వారానే విద్యరాదు, తపస్సు వల్ల కూడా విద్య వస్తుంది.

తులసీదాసు రామభక్తుడు, సూరదాసు కృష్ణభక్తుడు. సూరదాసు పాటలన్నా తులసీదాసు పాటలన్నా మహాత్మాగాంధీగారికి ఇష్టం. సూరదాసుకి "కృష్ణుడిపట్ల ఉన్న భక్తి

వల్ల, ఆ తపస్సు వల్ల కవిత్వం కూడా పుట్టుకొచ్చింది. మామూలు చదువు కాదు, తన హృదయంలోంచి పద్యాలు, పాటలు రాయగల శక్తి పుట్టుకొచ్చింది. అది ఎవరూ నేర్పలేదు, ఆ తపన వల్ల వచ్చేసింది". అప్పుడు అక్బర్ చక్రవర్తి పరిపాలిస్తున్న కాలం, అక్బర్ చక్రవర్తి స్వయంగా సూరదాసు పాటలు వినటానికి ఆయనని ఢిల్లీలో తన సంస్థానానికి ఆహ్వానిస్తాడు. ఢిల్లీకి 50 మైళ్ళ దూరంలో ఉంది సూరదాసు ఉన్న ఊరు. అప్పుడు సూరదాసు "కృష్ణుడి యొక్క కోర్టులో తప్పించి రాజుల యొక్క కోర్టులో నేను పాటలు పాడను" అంటాడు. ఆయన దరిద్రం అనుభవిస్తూ కూడా "నేను కృష్ణుడి కోర్టులో పాడతాను కానీ, భగవంతుడి కోర్టులో పాడతాను కానీ, మామూలు రాజుల యొక్క సంస్థానాలకి వెళ్ళి నా పాటలు పాడను, వాడు ఎంత చక్రవర్తి అయినా సరే" అంటాడు. తాను దరిద్రం అనుభవిస్తూ ఆ గ్రామస్తులు ఏది పెడితే అది తింటూ కూడా ఈ సూరదాసు భగవంతుడి కోర్టులో పాటలు పాడతాడు కానీ, డబ్బులకి, బహుమానాలకీ, సన్మానాలకీ ఆశపడి వాడు ఎంత చక్రవర్తి అయినా సరే వాడి సంస్థానానికి వెళ్ళి నేను పాటలు పాడను అంటాడు సూరదాసు. అయితే అక్బర్ సంస్కారము ఉన్నవాడు ఆయనే స్వయంగా వస్తాడు ఆ పాటలు వినటానికి సూరదాసు దగ్గరకి. అటువంటి కృష్ణభక్తుడు సూరదాసు.

ఇంతకీ సూరదాసు చరిత్ర చెప్పటంకోసం ఈ మాటలు చెప్పటంలేదు. ఈ పోరాటంలో సూరదాసు మనస్సు ఎంత వికసించిందో చూడండి. అక్బర్ చక్రవర్తిలాంటివాళ్ళే సూరదాసుని చూడటానికి వెళ్తున్నారు, చక్రవర్తులు, రాజులు వెళ్తున్నారు, వీడు మన సోదరుడు, మనము ఎంతో అవమానం చేసాము గుడ్డివాడు అని, మనం కూడా చూడటానికి వెళ్దాము అనుకుని అన్నదమ్ములు సూరదాసు ఉన్న ఊరికి వెళ్తారు. ఈ ఒక్క సంఘటన చెప్పటం కోసం సూరదాసు విషయం మీకు చెపుతున్నాను. నువ్వు మా తమ్ముడవు అని అప్పుడు అంటున్నారు, అప్పటివరకు గుడ్డివాడు అనేవారు తమ్ముడు అనేవారు కాదు. "నీకు మేము బహుమానాలు ఏమీ ఇవ్వలేదు, నిన్ను అవమానాలు చేసిన మాట నిజమే, కానీ నువ్వు ఇంటికి వచ్చెయ్యి. నిన్ను మేము ప్రేమగా చూస్తాము, మనమందరమూ సోదరులము, బంధువులము" అంటారు. అప్పుడు సూరదాసు అంటాడు "నిజమే మీరందరూ నాకు సోదరులే, మీరందరూ నాకు బంధువులే నేను కాదు అనటం లేదు, ఇప్పుడు నాకు మానవ జాతి అంతా కూడా బంధువులే". అతని మనస్సు ఎలా వికసించిందో చూడండి. "మీరు నాకు బంధువులే, అన్నదమ్ములే, అమ్మ నాన్న ఉన్నారు, నేను కాదనటం లేదు, కానీ ప్రపంచంలో

మానవుడు ఏ మూలనున్నా, జాతితోటి సంబంధం లేకుండా, కులంతోటి సంబంధం లేకుండా, దేశంతోటి సంబంధం లేకుండా, మానవజాతి అంతాకూడా నాకు బంధువులు" అంటాడు సూరదాసు. అందుచేత మీ ఇంటికే రావాలని నాకెక్కడ ఉంది? అంటే ఆ మనస్సు ఎంత వికసించిందో చూడండి. అతను అన్నగారికి ఇచ్చిన రిప్లైకోసం చెపుతున్నాను సూరదాసు చరిత్ర, చరిత్రకోసం చెప్పటంలేదు. "మీరు నాకు బంధువులే, నేను కాదనటంలేదు కానీ ఇప్పుడు నా పరిస్థితి ఎలా ఉందంటే, మనుషులు అందరూ నాకు బంధువులే" అంటాడు.

అసలు హృదయంలో ఆ తపన ఉంటే విద్య వచ్చేస్తుంది. అంత కవిత్వం కృష్ణుడి పట్ల ఉన్న భక్తి వల్ల వచ్చింది. అనుగ్రహం వల్ల వచ్చిన విద్య ఆకాశగంగ, అది ఎంగిలి ముక్కల్లా ఉండదు. చెరువులో, కాలువలో ఉన్న నీళ్లలో నలకలు ఉంటాయి కానీ ఆకాశ గంగలో నలకలు ఉండవు. సూరదాసు కవిత్వం అటువంటిది. ఆ తపన అంటూ ఉంటే తప్పనిసరిగా జరుగుతుంది. ఒక విద్యే కాదు ఏ విషయం పట్ల అయినా సరే, ఆత్మని తెలుసుకునే పట్ల అయినాసరే, ఆ తపన హృదయంలోంచి రావాలి. సూరదాసుతో అక్బర్ అంటాడు "నువ్వు చూస్తే గుడ్డివాడవు, నీకు వెనకాల ఏమీలేదు, అమ్మానాన్నలు, అన్నదమ్ములు, బంధువులు, స్నేహితులు విడిచిపెట్టేసారు, నీకు నా అన్నవాళ్ళు ఎవరూ లేరు, నువ్వు భగవంతుడి మీద అద్భుతమైన పాటలు పాడుతున్నావు నాకు చాలా సంతోషంగా ఉంది, నేను చక్రవర్తిని, కొన్ని వందల ఎకరముల భూమి నీకు పట్టా రాసిస్తాను, నువ్వు గొప్ప భక్తుడవు, నా ఆస్థానంలో పండితులు కూడా నువ్వు పాడినట్లు భగవంతుడి మీద పాటలు పాడలేకపోతున్నారు, నువ్వు ఇటువంటి దీనస్థితిలో ఉండకూడదు, అది సంఘానికి అపచారం. నీలాంటి గొప్ప భక్తులు, ఇటువంటి స్థితిలో ఉండటం సమాజానికి శ్రేయస్సు కాదు. నీకు వందల ఎకరముల భూమి ఇస్తాను, నువ్వు అనుభవించు" అంటాడు అక్బర్. అప్పుడు సూరదాస్ "ఓ అక్బర్! ఈ భూమి అంతా కూడా భగవంతుడిది అనుకొంటున్నాను, భగవంతుడి భూమిలో నాకు కొంత భూమికి పట్టా ఎందుకు? నాకు వద్దు" అంటాడు. ఎక్కడ ఉన్నాడో చూడండి సూరదాసు. "ఈ సమస్త భూమండలం అంతా కూడా భగవంతుడిదే. మళ్ళీ ఈ భగవంతుడి భూమిలో నా పేర పట్టా పుట్టిస్తావా? అది కూడా నాకు వద్దు అక్బర్!" అంటాడు సూరదాసు. వాడు భౌతికంగా గుడ్డివాడే, కానీ వాడి హృదయం ఎంత దూరం వెళ్ళిందో చూడండి.

సూరదాసును ముష్టివాళ్ళు విడిచిపెట్టి వెళ్ళిపోయిన తరువాత వీళ్ళెవరూ కనిపించటం లేదు ఏంటి అని తడుముకుంటూ పాకుతూ వెళ్ళి ఒక పాడు నుయ్యిలో పడతాడు సూరదాసు.

అప్పుడు సాక్షాత్తు కృష్ణస్వామి వచ్చి ఆ నూతిలో దిగి అతడిని చేతులతో పట్టుకొని నూతిలో నుంచి బయటకు తీసుకొస్తాడు. ఆ అమృతస్పర్శ నా జీవితంలో ఎన్నడూ మరువలేను అంటాడు సూరదాసు. ఆ స్పర్శ ఆయన భగవంతుడే అని నాకు అనిపించింది అంటాడు. అప్పటినుంచీ విపరీతమైన కవిత్వం పుట్టుకొచ్చింది సూరదాసుకి.

మీరు చేసిన మంచిపని వృధా పోదు. మీరు ఏమైనా మంచి పనులు చేసారు అనుకోండి, తప్పనిసరిగా మిమ్మల్ని బహుమానాలతో అలంకరిస్తాడు భగవంతుడు. అలాగే రామకృష్ణుడి తండ్రి ఖుదీరాం చటోపాధ్యాయకి 150 ఎకరముల ఆస్తి ఉండేది. ఆ గ్రామంలో ఏదో లిటిగేషన్ వచ్చింది. అక్కడి యజమాని నువ్వు కొన్ని అబద్ధాలు చెప్పాలి మా తరపున కోర్టుకు వచ్చి అని అడుగుతాడు. నేను అబద్ధాలు చెప్పను అంటాడు రామకృష్ణుడి తండ్రి. నువ్వు కనుక అబద్ధాలు చెప్పకపోతే, నీ 150 ఎకరాలు పోయేవరకూ నేను విశ్రాంతి తీసుకోను అంటాడు ఆ పెద్దమనిషి. నా సర్వస్వం పోయినాసరే, నా శరీరం పోయినాసరే, నేను అబద్ధం చెప్పను అంటాడు చటోపాధ్యాయ. ఎంత అమాయకుడు, ఒక అబద్ధం చెపితే పోతుంది కదా, వీడు ఆస్తి అంతా పోయేలా చేసుకొంటున్నాడు అనుకొన్నారు గ్రామస్తులు. కానీ భగవంతుడు చలించాడు. ఇక్కడ ఎంత తేడా ఉందో చూడండి. ఒక చిన్న అబద్ధం ఆడితే 150 ఎకరాలు నిలబడతాయి కదా అని గ్రామస్తులు అనుకొంటున్నారు, కానీ భగవంతుడు ఇతని వజ్రసంకల్పానికి, కఠోరమైన సంకల్పానికి చలిస్తున్నాడు. పది ఇరువై సంవత్సరాలకి ఆ 150 ఎకరాలు పోగొట్టేలా చేసాడు. అప్పుడు కట్టుగుడ్డలతోటి బయటికి వచ్చేసాడు చటోపాధ్యాయ. ప్రక్క ఊరిలో గుడిసె వేసుకొని జీవిస్తూ ఉంటాడు. ఆస్తి పోయింది అని అతనికి బెంగ కూడా లేదు. అలా నిశ్చలంగా ఉన్నాడు, భగవంతుడు ఆయన ఆస్తి. ఒకసారి గయలో విష్ణువు స్వప్నంలో కనిపించి స్వయంగా చెప్పాడు, చటోపాధ్యాయా నాకు మీ ఇంటికి రావాలని ఉంది. భగవంతుడు ఇంటికి వస్తాడని, వస్తే మర్యాద చెయ్యవచ్చు అనుకుంటున్నాడు చటోపాధ్యాయ. ఇదంతా స్వప్నం. ప్రమాదం ఎక్కడ వచ్చిందంటే, నాకు మీ ఇంటికి రావాలని ఉంది అంటే చటోపాధ్యాయ చలించలేదు. మూడుసార్లు మీ ఇంటికి రావాలని ఉంది అని, నాలుగవసారి మామూలుగా రావటం కాదు నీ కడుపున పుట్టాలని ఉంది అంటాడు మహావిష్ణువు. అప్పుడు చలిస్తాడు నా కడుపున పుట్టవద్దు, నాకున్న 150 ఎకరాలు పోయాయి, నేను తిండికి ఇబ్బంది పడుతున్నాను. నువ్వు భగవంతుడిని అంటున్నావు, నువ్వు నా కడుపున పుట్టి

దరిద్రం అనుభవించవద్దు అంటాడు. నువ్వు మా ఇంటికి వస్తే నాకు అభ్యంతరం లేదు, కానీ నా కడుపున పుట్టొద్దు, నేను నీకు అన్నం పెట్టలేను. నువ్వు ఈ సృష్టికి ప్రభువైన మహావిష్ణువు, నేను ఉండేది ఈ కుటీరంలో, తాటాకు పాకలో ఉన్నాను. నువ్వు మా ఇంటిలో పుడితే, నీకు బట్టలు కుట్టించలేను, అన్నం పెట్టలేను, నీకు సరైన నీడ కూడా ఇవ్వలేను. ఇటువంటి దరిద్రుడి ఇంట్లో పుట్టటం భావ్యమా? నువ్వు మా ఇంటికి రావద్దు స్వామీ అంటున్నాడు. అప్పుడు భగవంతుడు రాజీ పడుతున్నాడు. నువ్వు పెట్టిన అన్నం తింటాను, నువ్వు ఏ గుడ్డ ఇస్తే అది కట్టుకుంటాను, నేనేమీ పేచీలు పెట్టను, నువ్వు ఏ మంచం మీద పడుకుంటే నేనూ ఆ మంచం మీద పడుకుంటాను, నువ్వు ఏ కూర పెడితే ఆ కూరతోటి తింటాను, అంగీకరించమంటున్నాడు. భగవంతుడికి అన్నం ఏమిటండీ! నేనేమీ పేచీలు పెట్టను, నువ్వు అంగీకరిస్తే నీ ఇష్టం మీద నీ ఇంటిలో పుడతాను చటోపాధ్యాయా అన్నాడు విష్ణువు. అప్పుడు చలిస్తాడు, అప్పుడు కానీ తన అంగీకారాన్ని ఇవ్వలేదు మహావిష్ణువుకి. అప్పుడే రామకృష్ణుడు జన్మిస్తాడు. భగవంతుడు రామకృష్ణ పరమహంసగా జన్మించే ముందు అంత ఘర్షణ అయితే కానీ అతని కడుపున పడలేదు. ఇంతకీ ఈ మాటలు ఎందుకంటే, లోకం దృష్టిలో చటోపాధ్యాయ మామూలువాడే అమాయకుడే కావచ్చు, కానీ ఈశ్వరుడు అనుగ్రహించాడు.

చాలామంది రాళ్ళని ప్రేమించినట్టుగా మనుషులని ప్రేమించలేరు, వాళ్ళకి వేదాంతం ఏమిటండీ! కొంతమంది రాళ్ళని ప్రేమిస్తారు, రాళ్ళని గౌరవిస్తారు, రాళ్ళ కోసం ఎంత డబ్బైనా ఖర్చుపెడతారు, కానీ మనిషిని ప్రేమించలేరు. రమణస్వామి శరీరం విడిచిపెట్టేముందు ఎవరో అంటారు, మీ విగ్రహం మద్రాసు నుంచి వస్తోంది అని. రమణస్వామి సంతోషిస్తారు అని వాళ్ళ ఉద్దేశం. మనం అంతేకదా మన విగ్రహం ఎవరైనా చేయిస్తే సంతోషిస్తాము, లోపాయకారిగా డబ్బులు ఇచ్చి కూడా విగ్రహాలు పెట్టించుకుంటాము. ఆయనకి విగ్రహాలు ఎందుకండీ! అప్పుడు భగవాన్ అన్నారు, అవును మరి రాతి మనుషులకి రాతి దేవుళ్ళే ఉండాలి. రమణస్వామిని ఒకసారి ఎవరో అడిగారు మీరు దేవుడిని చూసారా అని. నీ ఎదురుగా ఉన్నవాడు ఎవరో నీకు తెలియటంలేదు, నన్ను దేవుడిని చూసావా అని అడుగుతున్నావు. కొంతమంది రాళ్ళకి లక్షలు ఖర్చు పెడతారు, కానీ ఎండలో ఉన్న మనిషిని నీడకి రమ్మనే స్వభావం కూడా వాళ్ళకు ఉండదు. వాళ్ళకి తత్త్వం ఏం తెలుస్తుంది?

ఇప్పుడు లెర్నింగ్ అంతా ఎర్నింగ్ కోసమే. ఎర్నింగ్ రాదు అంటే లెర్నింగ్ మానేస్తారు.

రామకృష్ణ పరమహంసని వాళ్ళ అన్నగారు నీకు మంత్రాలు రావు నీకు ఉద్యోగం ఎవరిస్తారు అనేవాడు. వాళ్ళు పూజారులు, మంత్రాలు నేర్చుకుంటే గుళ్ళో మంత్రాలు చదవవచ్చు. నీకు బ్రతుకు తెరువు బాగుంటుంది, రూపాయల కోసం మంత్రాలు నేర్చుకోమనేవాడు, గుళ్ళో ఉద్యోగం ఇప్పించటం కోసం. అప్పుడు రామకృష్ణుడు చెప్పేవాడు, నాకు ఎర్నింగ్ కోసం మటుకు లెర్నింగ్ వద్దు. భవిష్యత్తులో సంపాదించుకోవటానికి బాగుంటుందని చదువుకోమంటున్నావు, కానీ సంపాదన కోసం నేను చదువుకోను అంటాడు రామకృష్ణుడు.

ప్రపంచంలో కూడా ఎంతో అందం సౌందర్యం ఉంది. ఎదుటి మనుషులలో ఉన్నతమైన మనుషులని మనము గుర్తించలేకపోవటానికి కారణం ఈ నేను, నాది అనే భావనే. ఇక్కడ కూర్చున్న వాళ్ళ హృదయాలలో ఏదో ఔన్నత్యం గొప్పతనం ఉందనుకోండి, ఆ గొప్పతనం నేను కళ్ళతోటి చూడలేకపోతున్నాను అంటే కారణం నాలో ఉన్న స్వార్థం, నేను అనే భావన. నాలో ఉన్న అహంకారం, నాలో ఉన్న స్వార్థం, ఈ నేను నాది అనే భావన మీలో ఉన్న సౌందర్యాన్ని, మీలో ఉన్న ఔన్నత్యాన్ని చూడనివ్వదు. నా కళ్ళని గుడ్డివాడి కింద చేసేస్తుంది. కళ్ళు ఉండి కూడా కళ్ళులేని వాడిలా అయిపోతాను. హృదయంలో స్వార్థం ఉన్నంతకాలం ప్రేమ ఉదయించదు. ప్రేమ ఉదయించనంత కాలం వాడికి దైవసాక్షాత్కారం కానే కాదు.

స్పీచ్ కంటే సైలెన్స్ గొప్పది. స్పీచ్‌కి సోర్స్ సైలెన్స్. సైలెన్స్ లోంచే స్పీచ్ వస్తోంది. నా హృదయంలో ఎప్పుడైతే స్వార్థం లేదో అప్పుడే నా హృదయంలోంచి ప్రేమ పుట్టుకొస్తుంది. ఆ ప్రేమ నాకు కలిగినప్పుడే నేను దేహాలకి, రూపాలకి, నామాలకి, ఈ సృష్టికి కూడా అతీతుడను అవుతాను, అప్పుడు నేను ప్రేమస్వరూపుడను అవుతాను. ఆ ప్రేమలోంచే నాకు దైవసాక్షాత్కారం కలుగుతుంది. హృదయపూర్వకంగా ప్రేమించే మనిషికి అసలు వేదన ఉండదు. మీరు ఒక వంతెన కట్టవచ్చు, ఒక మేడ కట్టవచ్చు, ఒక ఇల్లు కట్టవచ్చు, కానీ ఒక మనిషిని బాగుచెయ్యండి - వాటికంటే ఇది గొప్పది.

సాధన చేస్తున్నట్టు మీకు తెలియకుండానే మీరు గమ్యం చేరాలి. మీరు సాధన చేస్తున్నట్టు మీకు తెలియకూడదు, అందులోంచి సఫరింగ్ మీకు పుట్టకూడదు, మీరు గమ్యం చేరాలి, అదీ మన సత్సంగం యొక్క లక్ష్యం. సాధన పేరుమీద మీకు దుఃఖం రాకూడదు. మీరు బాధ పడకూడదు. అసలు మూలంలోకి వెళ్ళి ఆలోచిస్తే, ఎవడైతే నేను మోక్షం పొందాలి అని మనలో అనుకుంటున్నాడో వాడు కూడా అబద్ధమే. వాడే అబద్ధం అయినప్పుడు సాధన నిజం ఎలా అవుతుంది. మనందరికీ కూడా చావు అంటే భయం, ఇందులో ఏమైనా

అనుమానం ఉందా? దేవుడు ఉన్నాడని చెప్పే వాడికీ చావు అంటే భయం, దేవుడు లేడని చెప్పేవాడికీ చావు వస్తోందంటే భయమే. దేవుడు ఉన్నాడో లేదో మాకు అక్కరలేదు అంటారు కొంతమంది, దేవుడు ఉన్నాడని చెప్పరు లేడని చెప్పరు, వాళ్ళకీ భయమే చావు వస్తోంది అంటే. మనకి ఎంతోకొంత భక్తి ఉంది, కానీ మనకి భయమే. డాక్టరుగారు ఇంకో గంటలో చచ్చిపోతావని చెపితే మనకి భయం వేస్తోంది, దానికి కారణం ఇడ్లీలు తినటానికి అలవాటు పడ్డాము. మన శరీరం చచ్చిపోతే ఇడ్లీలు ఎవడు తింటాడు ఇక్కడ, సిగరెట్లు ఎవడు కాలుస్తాడు? బ్రతికి ఉన్నాము కాబట్టి పాలకొల్లు వెళ్ళి సినిమా చూసి వస్తున్నాము, చచ్చిపోతే సినిమాకి ఎవడు వెళ్తాడు? శరీరం ఉంటే సినిమా చూడొచ్చు, శరీరం ఉంటే ఇడ్లీలు తినొచ్చు, క్షీరాన్నం తాగొచ్చు. శరీరం ఉంటే ఎన్ని ఇంద్రియాలు ఉన్నాయో అన్ని ఇంద్రియాలతోటి భోగాలు అనుభవించవచ్చు. అంటే తన శరీరం వల్ల తాను సుఖపడుతున్నాను అనే భావన వీడికి ఉంది కాబట్టి, శరీరం పోతుంది అంటే వీడికి భయం వేస్తోంది? చావు అంటే భయపడటానికి కారణం, తను సుఖపడటానికి తన శరీరం ఉపయోగపడుతోంది అని వీడు అనుకోవటం వల్ల చావు అంటే భయం వేస్తోంది. తన కోసమే ఇది. ఒక గంటో, రెండు గంటలో సినిమా చూస్తే నీకు సంతోషం వస్తుంది, శరీరం లేకపోతే ఆ సంతోషం ఎక్కడ నుంచి వస్తుంది? అందుచేత భయం వేస్తోంది మీకు చావు అంటే. మీరు అర్థం చేసుకోండి, నేను చెప్పే ఈ గొడవకి దేవుడితో సంబంధం లేదు. చావులో నా సుఖం పోతుంది అనుకుంటున్నాను కాబట్టి, చావుని నేను కోరుకోవటం లేదు. నేను చెప్పేది మీరు నమ్మవద్దు, ఇంటికి వెళ్ళాక ప్రశాంతంగా ఆలోచించుకోండి. మీకు జున్ను అంటే బాగా ఇష్టం అనుకోండి, బ్రతికి ఉంటే ఆ జున్ను తిన్నప్పుడు 5 నిమిషాలో, 10 నిమిషాలో మీకు సుఖం వస్తుంది, శవం ఈ జున్నునేమి తింటుంది? హృదయం యొక్క లోతులలో గడ్డపార పెట్టి తవ్వి తవ్వి చూస్తే ఈ దుంప కనిపిస్తుంది. లోపల హృదయంలో ఒక దుంప ఉంది. శరీరం ఉంటేనే నేను సుఖపడతాను. శరీరం లేకపోతే ఆ సుఖం పోతుంది అనే భావన వల్లే ఆ దుంప వల్లే నాకు చావు అంటే భయం వేస్తోంది. చావు వల్ల శరీరము, నేను విడిపోతున్నాము. మీరు ఇంటికి వెళ్ళిన తరువాత ప్రశాంతంగా ఆలోచించండి, మీకు చావు అంటే ఎందుకు భయం వేస్తోందో, మీకే కాదు ప్రతివాడికీ మృత్యువు అంటే భయమే కదా!

చెట్టుకి నీరు అందాలి అంటే, చెట్టు మొదలులో నీరు పోస్తే మొత్తం కొమ్మలకి రెమ్మలకి ఆకులకి అన్నిటికీ అందిపోతుంది. చెట్టు మొదలులో వెయ్యటం మానేసి, ఏదో

ఒక కొమ్మకి నీరు వేస్తే ఆ చెట్టుకి అంతా అందదు. అదేవిధంగా మొదలు మన ఆత్మ, అసలు మూలంలో ఆత్మని తెలుసుకోవటానికి కనుక మనం ప్రయత్నం చేస్తుంటే, చెట్టు మొదలులో వేసిన నీరు మొత్తం ఆకులకి రొబ్బలకి ఎలా అందుతుందో, అలాగే మనం ఆత్మని తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తే మొత్తం సద్గుణాలు అన్నీ వచ్చి మనని వరిస్తాయి. ఒక్కో రొబ్బకి ఒక్కో రొబ్బకి మనం నీరు పోయనక్కరలేదు, మొదలులో పోస్తే సరిపోతుంది. అదేవిధంగా మనం ఆత్మనే లక్ష్యంగా పెట్టుకొని, ఆత్మయందే దృష్టిపెట్టుకొని, ఆత్మని అన్వేషించటానికి మన జీవితాన్ని ఖర్చు పెడుతుంటే అన్ని సద్గుణాలు వచ్చి మనని వరిస్తాయి. ప్రత్యేకంగా ఈ సద్గుణం రావాలి ఈ సద్గుణం రావాలి అని మనం అనుకోనక్కరలేదు. అన్ని సద్గుణాలు వచ్చి మనల్ని వరిస్తాయి. అంటే బాగు చేసుకోవలసినది మనస్సుని. మనకి మూడు అవస్థలు వస్తున్నాయి. ఇప్పుడు మనం జాగ్రదవస్థలో ఉన్నాము. రాత్రి నిద్రపోతాము సుషుప్తావస్థ, మళ్ళీ రాత్రి కలలు వస్తాయి అది స్వప్నావస్థ. ఈ మూడు అవస్థలు చూసేది లోపల ఒకటి ఉంది. ఈ మూడు అవస్థలూ కూడా తెరమీద బొమ్మలు నడిచినట్టు ఆత్మలోనే నడుస్తున్నాయి. ఇప్పుడు మనం ఇక్కడ కూర్చుని మాట్లాడేది, మనకి కలలు రావటం పోవటం, గాఢనిద్ర, ఇవన్నీ ఆత్మలోనే జరుగుతున్నాయి.

మీ హృదయంలో ఉన్న దేవుడి మీద మీకు గౌరవం లేదు, కానీ మీ హృదయంలో ఉన్న దేవుడు నిజం, గుళ్ళో ఉన్న దేవుడు అబద్ధం. అయితే మనకి ద్వైతబుద్ధి ఉంది కాబట్టి ఈ దేవాలయాలు ఇవన్నీ మన కోసమే పెట్టారు. దేవాలయాలు పుణ్యక్షేత్రాలు మన అభివృద్ధి కోసమే పెట్టారు. మనం హృదయంలో దేవుడిని చూడలేము కానీ ఇది నిజం, బయట దేవుడు అబద్ధం. గుళ్ళో ఉన్న దేవుడికి వెళ్ళి నమస్కారం ఎందుకు పెట్టమన్నారంటే, హృదయంలో ఉన్న ఆత్మని ఏనాటికైనా తెలుసుకోవటానికి ట్రైనింగులా ఉపయోగపడటం కోసం. మనస్సుని లోపలికి పంపగలగాలి, సత్యం అనేది ఎక్కడ ఉందో, ఈశ్వరుడి యొక్క అస్థిత్వం ఎక్కడ ఉందో, స్వామి ఎక్కడైతే ప్రకాశిస్తున్నాడో అక్కడికి మనస్సుని పంపించటానికి సహకరించే వాడే గురువు.

భగవాన్‌కి మనకి ఈ జన్మలో సంబంధం లేకపోవచ్చు. ఏదో జన్మలో సంబంధం లేకపోతే ఆయన మీద మనకి ఆప్యాయత కలుగదు. మనకి ఏదైనా ఒక సంస్కారం లోపల ఉంది అనుకోండి, నాకు ఆ తలంపు వచ్చిన తరువాత తెలుస్తుంది ఆ సంస్కారం లోపల ఉందని. మనకి ఆ తలంపు రాకముందే భగవంతుడికి మనలో ఏ సంస్కారం ఉందో

తెలుస్తుంది. ఏసుతో ఆయన శిష్యుడు ఒకడు అంటాడు, నువ్వు మహాత్ముడవు, నువ్వు దేవుని కుమారుడవు. ఆ మాట నిజమే పాపం. అయితే డబ్బు అంటే కొంచెం ప్రీతి ఉంది ఆ శిష్యుడికి. నువ్వు దేవుని కుమారుడవు అనే మాట నిజంగానే అంటున్నాడు. అయితే అతనిలో ఏ సంస్కారం దాగి ఉందో ఏసుకి తెలుసు; అప్పుడు ఏసు అంటాడు, నువ్వు నన్ను దేవుని కుమారుడు అంటున్నావు, కానీ ఇంకో మూడు రోజులలో 30 రూపాయల లంచానికి నన్ను పట్టిస్తావు. అలాగే 30 రూపాయల లంచానికే పట్టించేసాడు. అప్పుడు నిజంగా అతనికి దురుద్దేశం లేదు, ఇది మీరు గ్రహించండి. కానీ ప్రభుత్వం ఎప్పుడైతే 30 రూపాయలు ఆశ చూపించిందో, ఆ ఆశలో పడిపోయాడు. ఎప్పుడైతే డబ్బుని కళ్లతోటి చూసాడో, డబ్బు మీద అతనికి ఉన్న ఆశ సడన్‌గా పైకి వచ్చింది. అందులో పడిపోయి, ఏసు ఫలానా చోట దాక్కున్నాడు వెళ్లి పట్టుకోండి అని గవర్నమెంట్‌తో చెపుతాడు. అదే ఏసు అన్నాడు. నువ్వప్పుడు నన్ను దేవుని కుమారుడు అంటున్నావు, మూడు రోజులలో 30 రూపాయల లంచానికి పట్టిస్తావు. అంటే జరుగబోయేది కూడా తెలుస్తుంది వాడే ఈశ్వరుడు.

కాళిదాసు అంటాడు వస్తువులు ఎదురుగా లేనప్పుడు అందరూ పెద్దమనుషులే, వస్తువు ఎదురుగా ఉన్నప్పటికీ చేతికి అన్నీ అందుబాటులో ఉన్నప్పటికీ, ఎవడికైతే ఇంద్రియాలలో వికారం పుట్టదో అప్పుడు వాడు సరైన సాధకుడు. వెటకారం కోసం ఈ మధ్యన ఒకరిద్దరు కొన్ని ప్రశ్నలు అడిగారు. ఈ భగవాన్ నేను ఎవడను తెలుసుకోమంటున్నాడు, ఈ నేను ఎవడను ఏంటి? దేవుడికి నమస్కారం పెట్టుకోమని చెపితే బాగుంటుంది అన్నారు.

సోదరమహాశయులారా! భగవంతుడు భక్తియోగం, జ్ఞానయోగం, కర్మయోగం, ధ్యానయోగం అన్నీ చెప్పాడు. ఈ యోగాలన్నీ కూడా నేను ఎవడను తెలుసుకోవటం కోసమే భగవంతుడు చెప్పాడు అన్న సంగతి ఆ ప్రశ్నించే వాడికి తెలియదు. భగవంతుడు భగవద్గీతలో భక్తియోగం ఎందుకు చెప్పాడంటే భక్తియోగం ద్వారా నువ్వు ఎవరవో నువ్వు తెలుసుకోవటం కోసమే, అలాగే కర్మయోగం, జ్ఞానయోగం, ధ్యానయోగం అన్నీ కూడా నువ్వుఎవరివో నువ్వు తెలుసుకోవటం కోసమే భగవంతుడు చెప్పాడు. నువ్వు ఎవడివో నువ్వు తెలుసుకోవటం కోసం ఇన్ని యోగాలు, రకరకాల మనుషుల కోసం భగవంతుడు చెప్పాడు. ఆ సంగతి వీళ్లకి తెలియక, భగవాన్ నువ్వు ఎవరవో నువ్వు తెలుసుకోమని చెప్పాడు అంటే అదేదో డ్రైగా ఉందని వీళ్లు అంటారు. ఏదో హేళన కోసం అడుగుతున్నాము అని అనిపిస్తోంది వాళ్లకి. భగవంతుడు వాసుదేవస్వామి కూడా అదే విషయాన్ని భగవద్గీతలో చెప్పాడు అన్న సంగతి ఈ

హేళనగా అడిగే వాడికి తెలియదు. పోనీ గుళ్ళోకి వెళ్ళి నమస్కారం పెట్టుకోమని చెపుతాను అనుకోండి, గుళ్ళోకి వెళ్ళి నమస్కారం పెట్టుకోవటం వల్ల ప్రయోజనం ఏమిటి? దాని గమ్యం ఏమిటి? మీరు రాముడికి నమస్కారం పెట్టకపోతే రాముడు దుఃఖపడతాడా? కృష్ణుడికి నమస్కారం పెట్టకపోతే కృష్ణుడు బాధపడతాడా? మీ నమస్కారాల కోసం దేవుళ్ళు కనిపెట్టుకున్నారా? మీరు నమస్కారం పెట్టలేదని వాడు బాధపడితే వాడు దేవుడు అవుతాడా? వాళ్ళకి నమస్కారాలు పెట్టటం, మీరు ఎవరో మీరు తెలుసుకోవటం కోసమే.

పాల్ బ్రంటన్‌కి భగవాన్ ఎదురుగా కూర్చుంటే తన జీవితంలో జరిగిన సంఘటనలు అన్నీ జ్ఞాపకం వస్తున్నాయి. ఈ సంగతి భగవాన్‌కి తెలియకూడదని నేను అనుకొనేవాడిని, కానీ ఆయన సమక్షంలో కూర్చున్నప్పుడు ఏ సంఘటన అయితే భగవాన్‌కి తెలియకూడదని అనుకొనేవాడినో ఆ సంఘటనే నా స్మృతిలోకి వచ్చేది అంటాడు బ్రంటన్. అప్పుడు నాకు అనిపించింది, ఐయాం పవర్‌లెస్ టు ఎస్కేప్ అని. నా తలంపులు, కోరికలు, ఊహలు, బలహీనతలు, ఆలోచనలు అన్నీ కూడా ఆయనకి తెలుస్తున్నాయి. ఇవన్నీ ఆయనకి తెలుస్తున్నాయి అన్న సంగతి నాకు తెలుస్తోంది. ఐయాం పవర్‌లెస్ టు ఎస్కేప్ అన్నాడు బ్రంటన్. ఈశ్వరుడికి జరుగబోయేది కూడా తెలుస్తుంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, జూన్ 2017 - జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ప్రకృతిలో తమోగుణం, రజోగుణం, సత్వగుణం ఈ మూడు గుణాలు ఉంటాయి. తమోగుణంలో సోమరితనం ఎక్కువగా ఉంటుంది. రజోగుణంలో ఆడంబరం ఎక్కువగా ఉంటుంది. రజోగుణంలో ఉన్నవాళ్ళు ఎక్కువగా కీర్తిని కోరుకుంటారు. సత్వగుణం ఉన్నవాళ్ళు క్వయిట్‌గా, కూల్‌గా ఉంటారు. వారికి తెలుసున్న విషయం తెలుసున్నట్లుగా చెపుతారు, తెలియని విషయం తెలియదని చెపుతారు, తెలియని విషయం తెలుసున్నట్లు నటించరు. సత్వగుణం ఉన్నవాళ్ళకు టెన్షన్ ఏమీ ఉండదు, పాజిటివ్‌గా ఉంటారు, వాళ్ళ దగ్గర యాక్షనే గానీ రియాక్షన్ ఉండదు. నీకు ఏదైనా ఉపకారం చేయాలంటే చేస్తారు కానీ నెగిటివ్‌గా పనిచేయరు. సత్వగుణం ఉన్నవారు సోషల్ సర్వీస్ చేసినా చేసినట్లుగా తెరమీద కనబడరు. అక్కడ పని జరుగుతూ ఉంటుంది. వ్యక్తిభావన కనబడదు. సత్వగుణం ఉన్నవారు ధన్యులు, వారు దేవుని చూసెదరు అన్నాడు యేసు. మనం సత్వగుణంలో లేము అనుకో ఏదో రజోగుణంలోనో, తమోగుణంలోనో ఉన్నట్లు అర్థం. మనం సత్వగుణాన్ని ప్రాక్టీసు చెయ్యాలి.